



కళ్లెం టెక్స్‌టైల్‌ పార్కు

# సైట్లు సిద్ధం
# సర్కారుదే ఆలస్యం

## బాలారిష్టాల్లో కళ్లెం టెక్స్‌టైల్‌ పార్కు

- 15 ఏళ్లవుతున్నా ప్రారంభం కాని పరిశ్రమ
- 2009లోనే 117 ఎకరాల భూసేకరణ
- బీఆర్‌ఎస్‌ హయాంలో అభివృద్ధి పనులు
- 465 యూనిట్ల స్థాపనకు అవకాశం
- పెట్టుబడులు అందక ముందుకు రాని ఔత్సాహికులు
- కాంగ్రెస్‌ ప్రభుత్వం సహకరించాలని విన్నపం
- పార్కు ప్రారంభమైతే 20 వేల మందికి ఉపాధి

**కళ్లెం టెక్స్‌టైల్‌ పార్కు బాలారిష్టాల్లో చిక్కుకుం ది. సకల సౌకర్యాలతో గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం సైట్లు సిద్ధం చేసి ఔత్సాహికులకు కేటాయించినా పరిశ్రమ ప్రారంభం కావడంలేదు. ఒక్క యూనిట్‌ ప్రారంభించాలంటే రూ.కోటికి పైగా నిధులు అవసరం కావడంతో లబ్ధిదారులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందుకొచ్చి బ్యాంకర్లతో మాట్లాడి రుణాల విషయంలో వెసులుబాటు కల్పిస్తే తప్ప అడుగుముందుకు పడే పరిస్థితి కనిపించడంలేదు.**

జనగామ, జూన్‌ 18 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రతిపాదించిన కళ్లెం టెక్స్‌టైల్‌ పార్కు ప్రారంభానికి మోక్షం కలగడం లేదు. పార్కు ఏర్పాటుకు 2009లో అడుగులు పడగా 15 ఏళ్లు అయినా నేటికీ అతీగతి లేకుండా పోయింది. 15 ఏళ్లుగా ఎన్ని ప్రభుత్వాలు మారినప్పటికీ టెక్స్‌టైల్‌ పార్కు మాత్రం ప్రారంభం కావడం లేదు. 2009లో పార్కు ఏర్పాటుకు అడుగులు పడగా ఆ తర్వాత దాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పదేళ్ల తర్వాత 2019లో అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పార్కు ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఇందులో భాగంగా పార్కు అభివృద్ధికి సుమారు రూ. 25 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో టెక్స్‌టైల్‌ పార్కు ప్రతిపాదిత స్థలంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్‌ స్తంభాలు, సబ్‌స్టేషన్‌ నిర్మాణం, వాటర్‌ ట్యాంకు నిర్మాణం, యూనిట్ల స్థాపనకు అనుకూలంగా ప్లాట్ల అభివృద్ధి వంటి పనులను చేపట్టారు. దాదాపు రెండేళ్ల క్రితమే పనులు పూర్తయినప్పటికీ యూనిట్ల స్థాపన పనులు ముందుకు సాగలేదు.

### 2009లో భూసేకరణ

పొట్టచేత పట్టుకొని సూరత్‌, సోలాపూర్‌ లాంటి ప్రాంతాలకు వలస వెళ్లిన చేనేత కార్మికులను వెనక్కి రప్పించాలన్న లక్ష్యంతో 2009లోనే లింగాలఘణపురం మండలం కళ్లెం శివారులో టెక్స్‌టైల్‌ పార్కు ఏర్పాటుకు వైఎస్‌ హయాంలోని అప్పటి కాంగ్రెస్‌ ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇందులో భాగంగా కళ్లెం శివారులో 117 ఎకరాల స్థలాన్ని సేకరించారు. కాని పార్కు ఏర్పాటుకు మాత్రం ఎటువంటి కార్యాచరణ చేపట్టలేదు. దీంతో టెక్స్‌టైల్‌ పార్కు అంశం మరుగున పడిపోయింది. 2014లో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ అంశంపై దృష్టి సారించింది. తెలంగాణ స్టేట్‌ ఇండస్ట్రియల్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కార్పొరేషన్‌(టీఎస్‌ఐఐసీ) ఆధ్వర్యంలో పార్కు అభివృద్ధికి ముందుకొచ్చింది. అందులో భాగంగా టెక్స్‌టైల్‌ పార్కును యూనిట్ల స్థాపనకు అనుకూలంగా అభివృద్ధి చేసేందుకు రూ. 25 కోట్లు మంజూరు చేసింది.


చివరి దశలో ఉన్న వాటర్‌ ట్యాంకు నిర్మాణం

### పనులు పూర్తయినా పట్టింపు లేదు..

టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో చేపట్టిన కళ్లెం టెక్స్‌టైల్‌ పార్కుకు సంబంధించిన పనులు 95 శాతం పూర్తయ్యాయి. 2019లో అప్పటి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించడంతో పదేళ్ల పాటు మరుగున

» మిగతా 8వ పేజీలో...


పార్కులో పూర్తయిన అంతర్గత రోడ్లు


పూర్తయిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌

# పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

**ధరణి పెండింగ్‌ దరఖాస్తులను పరిష్కరించాలి**

**కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా**

**జిల్లాలో ఆస్పత్రులు, కార్యాలయాల్లో తనిఖీలు**


జఫర్‌గఢ్‌ ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్‌ రిజ్వాన్‌ బాషా

జఫర్‌గడ్‌, జూన్‌ 18 : విద్యాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మొదట జఫర్‌ఢ్‌ తహసిల్దార్‌ కార్యాలయానికి వెళ్లి ధరణి పెండింగ్‌ దరఖాస్తులపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. త్వరగా పరిష్కరించేలా చూడాలన్నారు. పలు రికార్డులను పరిశీలించారు. అలాగే ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని సందర్శించి వైద్యులు, సిబ్బంది హాజరు, వైద్య పరీక్షల రిజిస్టర్లను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. మండల కేంద్రంలో కలెక్టర్‌ పర్యటించి మిషన్‌ భగీరథ తాగునీటి సర్వేను పరిశీలించారు. ఓ ఇంటికి వెళ్లి మీ ఇంటికి మిషన్‌ భగీరథ నీళ్లు సక్రమంగా వస్తున్నాయా.. అంటూ అడుగగా... వారు వస్తున్నాయంటూ సమాధానమిచ్చారు. త్వరగా సర్వే పూర్తి చేసి నివేదికలను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం కలెక్టర్‌ కస్తూర్బా బాలికల విద్యాలయానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. బాలికలకు దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాలలో చేపడుతున్న మరమ్మతు, అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టోర్‌ రూంలో ఉల్లిగడ్డలు కుళ్లిపోయి ఉండడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని పడేసి మంచివి తెప్పించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తున్న స్టోర్‌ రూం ఇంచార్జీకి మెమో జారీ చేయాలంటూ డీఈఓ రామును ఆదేశించారు. అమ్మ ఆదర్శ కమిటీ అనుమతి లేకుండానే పనులు చేపడుతున్నారని మీపై ఫిర్యాదు వస్తున్నాయంటూ ఎస్‌వో స్వప్నను మందలించారు. తర్వాత తిమ్మంపేట జడ్పీ హైస్కూల్‌లో అభివృద్ధి పనులను పరిశీలించారు. మండల పరిధిలోని ఉప్పుగల్లు, కూనూరు, తిడుగు ఆకేరు వాగుల్లో నుంచి ఇసుక తరలింపు నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను సరిపడా పంపిణీ చేశామన్నారు.

ఆయన వెంట డీఈవో కె.రాముతో పాటు తహసిల్దార్‌ అంబటి ఆంజనేయులు, ఎంపీడీవో సుమన్‌, డిప్యూటీ తహసిల్దార్‌ బాసెట్టి హరిప్రసాద్‌, ఎంఆర్‌ఐ అనిల్‌బాబు, కార్యదర్శి బోనగిరి రాజేశ్వర్‌రావు, కస్తూర్బా ఎస్‌ఓ స్వప్న, తదితర అధికారులు పాల్గొన్నారు.

### విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవు..

స్టేషన్‌ఘన్‌పూర్‌: వైద్య సిబ్బంది నిబంధనలు అతిక్రమించి విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని కలెక్టర్‌ రిజ్వాన్‌భాషా హెచ్చరించారు. మంగళవారం ఆయన ఘన్‌పూర్‌ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. పలు రిజిస్టర్లను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సేవలు ఎలా ఉంటున్నాయని, వైద్యులు సకాలంలో స్పందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే పేషంట్స్‌ సంఖ్య చాలా తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ఉందని, చిన్న చిన్న మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వైద్యులు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ధరంసోత్‌ వెంకన్న, తహసీల్దార్‌ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్‌ సుధీర్‌, ఇంచార్జి సూపరిండెంట్‌ డాక్టర్‌ శంకర్‌, వైద్యులు జనార్ధన్‌, సుమన్‌, ప్రసన్నక్రిష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మునిసిపల్‌ సమావేశం

జనగామ, జూన్‌ 18 (ఆంధ్రజ్యోతి): జనగామ మునిసిపాలిటీ సాధారణ సమావేశం బుధవారం జరగనుంది. మునిసిపల్‌ చైర్‌పర్సన్‌ పోకల జమున అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 26 అంశాలపై చర్చ జరగనుంది. మునిసిపాలిటీ పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు, కొత్తగా చేపట్టబోయే పనులకు ఆమోదం కోసం 26 అంశాలతో ఎజెండా రూపొందించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లైటింగ్‌ ఏర్పాటు, వేసవి తాగునీరు బోర్ల ఫ్లషింగ్‌, మరమ్మతులు, లీకేజీ మెటీరియల్‌ కొనుగోలు, నీటి నిర్వహణ ఖర్చుల విషయం సభ దృష్టికి తీసుకురానున్నారు. అదే విధంగా పారిశుధ్య వాహనాలకు టైర్ల కొనుగోలు, మరమ్మతుల కోసం ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లింపులు చేయనున్నారు. బ్లీచింగ్‌, లైమ్‌ పౌడర్‌ కొనుగోలు, ట్రాక్టర్‌ ట్రాలీ కొనుగోలపై సభలో చర్చకు పెట్టనున్నారు. నల్లా బిల్లుల చెల్లింపు, ట్రేడ్‌ లైసెన్స్‌కు సంబంధించిన ఫ్లెక్సీల ప్రింటింగ్‌, బిల్‌ కలెక్టర్ల వద్ద ఉండే మిషన్ల మరమ్మతులకు, అద్దె మైకు చెల్లింపులకు సంబంధించి ఎజెండా అంశాల్లో చేర్చారు. దీనితో పాటు పట్టణంలో చేపట్టబోయే పలు పనులకు సంబంధించి సభలో చర్చించి ఆమోదం పొందనున్నారు.

## స్పోర్ట్స్‌ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

జనగామ, జూన్‌ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్‌ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 21 నుంచి 25 వరకు మండల స్థాయి ఎంపికలు చేపడుతున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి బి.వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి ఈనెల 29న జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయన్నారు. హైట్‌, వెయిట్‌, 30 మీటర్ల ఫ్లయింగ్‌ స్టార్ట్‌, స్టాండింగ్‌ బోర్డ్‌ జంప్‌, 800 మీటర్ల రన్‌, షటిల్‌ రన్‌, మెడిసిన్‌ బాల్‌ పుట్‌, వెర్టికల్‌ జంప్‌, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్‌ అంశాల్లో పరీక్షలు నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఎంపికల్లో పాల్గొనాలనుకునే వారు 2015 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. స్టడీ, జనన ధ్రువీకరణ పత్రాలు, 10 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మూడవ తరగతి ప్రొగ్రెస్‌ కార్డు, ఆధార్‌ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఈనెల 29న జరిగే జిల్లా స్థాయి ఎంపికలకు హాజరు కావాలని సూచించారు.

## సివిల్స్‌ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

జనగామ, జూన్‌ 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌ ఆధ్వర్యంలో సివిల్స్‌-2025 రాయబోయే అభ్యర్థులకు ఉచిత లాంగ్‌టర్మ్‌ శిక్షణను ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి శిక్షణ పొందాలనుకునే ఆసక్తి గల అభ్యర్థులు జూలై 3వ తేదీలోగా 'టీజీబీసీస్టడీసర్కిల్‌.సీజీజీ.జీవోవీ.ఇన్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 040-24071178 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## గ్రాండ్‌ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

గ్రూప్‌-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం హనుమకొండ బీసీ స్టడీ సర్కిల్‌ ఆధ్వర్యంలో నిర్వహించే ఆఫ్‌లైన్‌ గ్రాండ్‌టెస్ట్‌కు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8, 9, 15, 16, 22, 23, 30, 31 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రాండ్‌ టెస్ట్‌ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 'టీజీబీసీస్టడీసర్కిల్‌.సీజీజీ.జీవోవీ.ఇన్‌ వెబ్‌సైట్‌లో జూలై 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 040-24071178 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## ఒకరికి బదులు మరొకరు!

**ఓపెన్‌ డిగ్రీ పరీక్షల్లో అభ్యర్థుల నిర్వాకం**

జనగామ, జూన్‌ 18 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌ డిగ్రీ పరీక్షల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ పట్టుబడ్డారు. జిల్లాకేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం జరిగిన పరీక్షకు యాదాద్రి భువనగిరికి చెందిన పలువురు విద్యార్థులు హాజరయ్యారు. బీకామ్‌ ఫస్టియర్‌ పరీక్షకు కొప్పుల సంధ్యకు బదులుగా వెలిశాల మమత అదేవిధంగా ఎండి.విజయ్‌కు బదులుగా ఎస్‌.రవికుమార్‌ పరీక్షకు హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారులు గుర్తించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరీక్ష రాయించిన వారితో పాటు రాసిన వారు మొత్తం నలుగురిపై జనగామ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఛ్ఛ్‌.. ఏం చేయలేకపోయాం

**ఐదేళ్లు కేవలం మాటలకే పరిమితమయ్యాం**

**జడ్పీ చివరి సర్వసభ్య సమావేశంలో సభ్యుల అసంతృప్తి**

**ఇకనైనా జడ్పీ వ్యవస్థ తీరు మారాలని ఆకాంక్ష**



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ పింకేశ్‌కుమార్‌

జనగామ, జూన్‌ 18 (ఆంధ్రజ్యోతి): "ప్రజలకు సేవ చేయాలన్న ఆశయంతో జడ్పీటీసీలు, ఎంపీపీలుగా గెలుపొందాం. కానీ ఈ ఐదేళ్లలో మేం ఆశించిన పనులు చేయలేకపోయాం. నిధులు సరిగ్గా రాక అభివృద్ధి చేయలేకపోయాం. అధికారులు కూడా సహకరించలేదు. జడ్పీ మొదటి సర్వసభ్య సమావేశంలో అడిగిన ప్రశ్నలకు ఇంతవరకు సమాధానం రాలేదు. వార్డు మెంబర్ల కంటే అధ్వాన్నంగా మా పరిస్థితి తయారైంది" అంటూ అధికారుల తీరుపై మంగళవారం జిల్లా పరిషత్‌ కార్యాలయంలో జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీలు, ఎంపీపీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ ఐదేళ్ల పదవీకాలంలో జడ్పీ సమావేశాల పట్ల అసంతృప్తితో ఉన్నామని విచారం వ్యక్తం చేశారు. జడ్పీ మీటింగులకు కలెక్టర్లు ఎప్పుడూ సరిగా రాలేదని, అధికారులు కూడా సరిగా రావడం లేదని, తాము అడిగిన ప్రశ్నలపై సరైన స్పందన లేదని మండిపడ్డారు. జడ్పీ సమావేశాల ద్వారా ఏదో జరుగుతుందని తాము ఊహించామని, కానీ అనుకున్నట్లుగా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా జడ్పీ వ్యవస్థ మారాలని, సభ్యులకు సరైన గౌరవం దక్కాలని సభ్యులు ఆకాంక్షించారు. జనగామ జిల్లా జడ్పీ సభ్యుల పదవీకాలం జూలై 4తో ముగియనుండగా చివరి సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్‌ భాగ్యలక్ష్మీ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు తమ ఐదేళ్ల పాలన, అధికారులు తీరుపై కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌కు చెందిన సభ్యులు ముక్తకంఠంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో భాగంగా పలు శాఖల పనితీరుపై చర్చ జరిగింది.

పంటల సాగు సీజన్‌ నేపథ్యంలో రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండడం లేదని, ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదని రఘునాథపల్లి జడ్పీటీసీ అజయ్‌ సభలో లేవనెత్తారు. ఇతర జిల్లాల నుంచి నకిలీ విత్తనాలు వస్తున్నాయని, ఎరువుల దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ లేదని అన్నారు. జీలుగ విత్తనాలు సరిపడా ఉన్నాయని అధికారులు చెబుతున్నారని, కానీ విత్తనాల కోసం రైతులు క్యూలో నిల్చుంటున్నారని పాలకుర్తి జడ్పీటీసీ శ్రీనివాసరావు ఫొటోను చూపారు. గత ఏడాది అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలకు సంబంధించిన పరిహారం ఇంతవరకూ అందలేదని నర్మెట్ట జడ్పీటీసీ శ్రీనివాస్‌ సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్‌ స్పందిస్తూ తాము క్షేత్రస్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించామని, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు కూడా చేశామని చెప్పారు. పంట నష్ట పరిహారం మంజూరై ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేయగానే రైతుల ఖాతాల్లో జమ అవుతాయని అన్నారు.

జిల్లాలో ఆయిల్‌పామ్‌ దిగుబడి ప్రారంభమైనందున ప్రాసెసింగ్‌ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ఉద్యానవన శాఖ అధికారి కె.ఆర్‌ లత మాట్లాడుతూ జిల్లాలో 10 వేల ఎకరాల్లో దిగుబడి రాగానే ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. అప్పటి వరకు రైతులకు ఇబ్బంది లేకుండా అమ్మకాలు జరిగేలా చూస్తామన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏళ్లుగా సిటి స్కాన్‌ పనిచేయడం లేదని, దీనిపై ఎన్నిసార్లు మొత్తుకున్నా ఫలితం లేకుండా పోయిందని లింగాలఘనపురం జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అన్నారు. అదే విధంగా ఆసుపత్రిలో వెంటిలేటర్‌ సౌకర్యం, బ్లడ్‌ ప్యూరిఫయర్లు లేవని అన్నారు. జిల్లా పరిషత్‌కు ఇంతవరకూ భవనం లేదని, ఐదేళ్లుగా మండల పరిషత్‌ భవనంలోనే మీటింగులు ఏర్పాటు చేసుకున్నామని అన్నారు.

ఐదేళ్లలో తాము జడ్పీ మీటింగుల్లో మైకు తీసుకొని మాట్లాడడానికే సరిపోయిందని స్టేషన్‌ఘన్‌పూర్‌ జడ్పీటీసీ మారపాక రవి ఆవేదన వ్యక్తం చేశారు.


జీలుగ విత్తనాల కోసం క్యూలో నిల్చున్నారంటూ ఫొటో చూపుతున్న పాలకుర్తి జడ్పీటీసీ శ్రీనివాసరావు

గత సమావేశాల్లో అధికారులు ఇచ్చిన హామీలు నెరవేరిన దాఖలాలు లేవన్నారు. మీటింగుకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు రాకపోవడంపై ఆయన మండిపడ్డారు. అధికారులు రానప్పుడు తమకెందుకు సమాచారం ఇచ్చారని నిలదీశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌ ఆసుపత్రిలో విధులకు డుమ్మా కొట్టిన, అడ్వాన్స్‌గా ముందు రోజు సంతకం చేసిన వైద్యురాలిని ఎందుకు సస్పెండ్‌ చేయలేదని నిలదీశారు. దీనిపై అదనపు కలెక్టర్‌ పింకేశ్‌కుమార్‌ స్పందిస్తూ వైద్యురాలికి షోకాజ్‌ నోటీసు ఇవ్వడంతో పాటు శాఖాపరమైన చర్యల కోసం కమిషనర్‌కు లేఖ రాశామని తెలిపారు.

జీరో విద్యుత్‌ కొందరికి అమలు కావడం లేదని, ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌ చేయడంలోనూ తప్పులు జరిగాయని రఘునాథపల్లి ఎంపీపీ వరలక్ష్మీ సభ దృష్టికి తెచ్చారు. దీనిపై అదనపు కలెక్టర్‌ పింకేశ్‌కుమార్‌ మాట్లాడుతూ రేషన్‌కార్డుకు, గ్యాస్‌ కనెక్షన్‌కు ఆధార్‌ కార్డు లింక్‌ కాకపోవడంతో కొందరికి ఈ సమస్య ఏర్పడిందని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో పొరపాట్లు జరిగితే సవరణ చేసేలా చూస్తామన్నారు. ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో ఈ ప్రక్రియ కొంత ఆలస్యమైందన్నారు.



# ఉమ్మడి జిల్లాలో కొత్తగా 12 కో ఆపరేటివ్‌ బ్యాంకులు

**ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం**

**రుణమాఫీతో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం**

**హామీలను నెరవేర్చడం సీఎం రేవంత్‌కే సాధ్యం**

**డీసీసీ బ్యాంక్‌ మేనేజింగ్‌ కమిటీ సమావేశంలో టెస్కాబ్‌ చైర్మన్‌ మార్నేని**


సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్‌ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్‌ 18 : ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో కొత్తగా 12కో ఆపరేటివ్‌ బ్యాంకుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, రాష్ట్రంలో ప్రతీ రైతుకు డీసీసీబీల ద్వారా ప్రయోజనం పొందేలా ప్రభుత్వ సహకారంతో ముందుకు వెళతానని రాష్ట్ర సహకార అపెక్స్‌ బ్యాంకు (టెస్కాబ్‌) చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన డీసీసీ బ్యాంక్‌ మేనేజింగ్‌ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కోపరేటివ్‌ బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీకి టెస్కాబ్‌ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపా మన్నారు. టెస్కాబ్‌ పరిధిలో 33లక్షల మంది రైతులు సభ్యు లుగా ఉన్నారని, అయితే వీరిలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న సుమారు 7.75లక్షల మందికి రూ.4,786కోట్ల మాఫీ ద్వారా ప్రయోజనం కలగనుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రైతులకు లక్ష రుపాయల రుణమాఫీ చేయలేక పోయిందని విమర్శించారు. హామీ ఇచ్చి నెరవేర్చడం.. రైతు పక్షపాతిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమవుతుందన్నారు. ఎంతో నమ్మకంతో తనను టెస్కాబ్‌ చైర్మన్‌గా నియమించిన రేవంత్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు సేవ చేస్తానని రవీందర్‌రావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## కేసు పెట్టారన్న భయంతో గొత్తికోయ వ్యక్తి ఆత్మహత్య

### ములుగు జిల్లా కన్నాయిగూడెంలో ఘటన



ఆత్మహత్య చేసుకున్న పద్దెం లక్ష్మయ్య

ఏటూరునాగారం రూరల్, 18: పోడు నరికిన కారణంగా పోలీసులు కేసు పెట్టారన్న భయంతో ఓ గొత్తికోయవాసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో మంగళవారం జరిగింది. కన్నాయిగూడెం ఎస్‌ఐ సురేష్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం సమీపంలోని మల్కపల్లి గొత్తికోయగూడానికి చెందిన మడకం బోగయ్య, మడకం బండయ్య, మడవి చుక్కయ్య, పద్దెం లక్ష్మయ్య సమీప అడవుల్లో పోడు నరికేందుకు గాను బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన సునారికాని లక్ష్మయ్య, జనగం సమ్మయ్య వద్ద కొంత డబ్బు తీసుకొని ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందంలో భాగంగా బోగయ్య, బండయ్య, చుక్కయ్య, లక్ష్మయ్య కొంతమేర పోడు కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు పోడు నరికివేతను అడ్డుకున్నారు. ఆ తర్వాత అటవీశాఖ అధికారులు ఆ నలుగురిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అటవీశాఖాధికారులు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారన్న విషయం వారికి తెలవగా.. పద్దెం లక్ష్మయ్య(40) భయంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు లక్ష్మయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

## దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్, జూన్ 18 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల పరీక్షలు జరుగుతున్నాయి. జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు వ్యక్తులు ఒకరికిబదులుగా మరొకరు పరీక్షలు రాస్తుండగా తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్‌లు మంగళవారం తెలిపారు. వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# కొనేదెట్టా? తినేదెట్టా?

రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు

- వారం రోజుల్లోనే రెట్టింపు
- వర్షాభావం, కోతుల బెడదతో దెబ్బతిన్న పంటలు
- ఏపీ, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతితో మరింత భారం
- కొనలేక సామాన్యులు, పేదలు విలవిల

మహబూబాబాద్ టౌన్/తొర్రూరు/మరిపెడ జూన్ 18 : కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. ఇప్పటికే బియ్యం, ఇతర నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతుండగా.. కూరగాయల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ధరలిలా ఉంటే కొనేదెట్టా? తినేదెట్టా? అంటూ బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజులుగా మార్కెట్లలో కూరగాయల ధరలు రెట్టింపవడంతో మార్కెట్‌కు రూ.500 నోటు తీసుకువెళితే.. కనీసం వారం రోజులకు సరిపడా కూరగాయలు రాని పరిస్థితి ఉంది. ముఖ్యంగా సామాన్యులకు నిత్యం అందుబాటులో ఉండే టమాట కిలో రూ.70 పలుకుతోంది. నిన్నమొన్నటి వరకు రూ.30కి లభించిన టమాట ఇప్పుడు డబుల్ కావడంతో వినియోగదారులకు పట్టపగలే చుక్కలు కన్పిస్తున్నాయి. మృగశిరకార్తెలో ప్రవేశించి, వర్షాకాలం ప్రారంభమైనా సకాలంలో వర్షాలు కురవక పోవడం, ఎండ తీవ్రత తగ్గకపోవడం లాంటి కారణాలతో కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. మరో వైపు గ్రామాల్లో కోతుల బెడదతో కూరగాయల పంటలు సాగు చేసే వారి సంఖ్య తగ్గడం, ఒక వేళ సాగు చేసినా దిగుబడి తగ్గిపోతుండం కూడా కారనాలు కనిపిస్తున్నాయి. ఎప్పుడూ స్థానికంగా దొరికే కొత్తిమీర ధర గతంలో కట్టకు రూ.50 ఉంటే ప్రస్తుతం రూ.200 నుంచి రూ.300 పలుకుతోంది. ప్రస్తుతం కొత్తిమీరను మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇక ఆకుకూరలదీ అదే పరిస్థితి. గతంలో బచ్చలికూర, పాలకూర, గోంగూర రూ.10కి 5కట్టలు ఇస్తే ప్రసుతం ఒక్క కట్టను రూ.5కు విక్రయిస్తున్నారు. ప్రతీ రోజూ కూరగాయలకే రూ.100ఖర్చు చేయాల్సి వస్తే తమ పరిస్థితేంటని దినసరి కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





మహబూబాబాద్ మార్కెట్లో కూరగాయలను విక్రయిస్తున్న మహిళ

### దూర ప్రాంతాల నుంచి దిగుమతి..

ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా గిరిజన రైతులు కూరగాయలు, ఆకుకూరల సాగు చేస్తుంటారు. ఈసారి కూడా గతం కంటే అత్యధిక రైతులు కూరగాయల పంట సాగుకు మొగ్గు చూపినా వాతావరణం అనుకూలించకపోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో వినియోగదారుల డిమాండ్ల కనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఏపీలోని గుంటూరు, తిరుపతి, మదనపల్లి, తెలంగాణలోని బోయినపల్లి, ఒంటిమామిడి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణాచార్జీలు ఇతరత్రా ఖర్చులతో కలిపి కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి.



వారం రోజుల్లో కూరగాయల ధరలు పెరిగాయిలా (కిలోకు)

| రకం | నిన్నమొన్నటి వరకు | ప్రస్తుతం |
|---|---|---|
| టమాట | రూ.30 | రూ.70 |
| బీరకాయ | రూ.50 | రూ.160 |
| కాకరకాయ | రూ.50 | రూ.100 |
| దోసకాయ | రూ.20 | రూ.50 |
| దొండకాయ | రూ.20 | రూ.60 |
| గోరు చిక్కుడు | రూ.30 | రూ.60 |
| మిర్చి | రూ.50 | రూ.100 |
| మంచి చిక్కుడు | రూ.60 | రూ.100 |
| క్యారెట్ | రూ.60 | రూ.120 |
| క్యాబేజీ | రూ.30 | రూ.50 |
| కొత్తిమీర | రూ.50 | రూ.200 |
| పుదీన | రూ.50 | రూ.100 |

### ధరలు పెరిగి కొనుగోళ్లు తగ్గాయి

**మేదరమెట్ల వెంకట్రావు, కూరగాయల వ్యాపారి, మానుకోట**



కూరగాయల ధరలు పెరగడంతో కొనుగోళ్లు తగ్గాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, గ్రామాలు, తండాల్లో కోతుల బెడదతో కూరగాయల పంటలు చేతికి రావడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. రవాణా చార్జీలు, ఇతరత్రా ఖర్చులతో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ధరలు పెరిగి కొనుగోళ్లు తగ్గడంతో పెట్టిన పెట్టుబడులు వెళ్లడం లేదు.

### దళారులకే లాభం..

**రావిశెట్టి శోభ, కూరగాయల వ్యాపారి, మరిపెడ బంగ్లా**



కూరగాయల విక్రయంలో దళారులకే లాభం జరుగుతోంది. పొద్దస్తమానం ఎండకిఎండి, వానకితడిచి రిటైల్ వ్యాపారం చేస్తే పూటగడవడం గగనంగా మారింది. ఇవాళ టమాట బాక్స్ రూ.1600కు హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. తరుగు పోను కిలోకి రూ.100కు అమ్మినా నష్టమే వస్తుంది.

### కూరగాయలు కొనే పరిస్థితి లేదు

**సోమ సుమతి, మహబూబాబాద్**



కూరగాయల ధరలు ఆకాశన్నంటుతుండడంతో వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితి. ఏ కూరగాయల ధరలను చూసిన కిలో ధర రూ.60కి పైగానే ఉంది. రూ.500 తీసుకుని మార్కెట్ వెళితే కనీసం వారం రోజులకు సరిపడ కూరగాయలు రావడం లేదు. కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామన్య, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. సామాన్యులు కూరగాయలు కొనలేక పచ్చళ్లతో కాలం వెల్లబుచ్చుతున్నారు.

### మానుకోట జిల్లాలో 120ఎకరాల్లో కూరగాయల సాగు

**రాకేశ్, ఉద్యానశాఖ అధికారి, తొర్రూరు డివిజన్**



మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 120 ఎకరాల్లో రబీ సీజన్‌లో రైతులు కూరగాయల పంటలను సాగుచేస్తున్నారు. అయితే గత రెండు నెలలుగా ఉష్ణోగ్రతలు పెరిగి పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి విత్తన సమాయన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని మెలకలు దక్కి, కొన్ని ఎండి పోయాయి. దాంతో ఈ ఏడాది ఆశించిన విధంగా కూరగాయల పంటలు దిగుబడి కాలేదు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు.

## తొర్రూరు పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జూన్ 18 : తొర్రూరు ప్రాథమిక సహకార సంఘం సీఈవో మురళిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా సహకార సంఘం అధికారి వెంకటేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఇటీవల తొర్రూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాల విక్రయాల్లో అవకతవకలు జరిగిన నేపథ్యంలో వ్యవసాయశాఖ ఏవో కుమార్‌తో పాటు ముగ్గురు ఏఈవోలు సస్పెండ్ అయ్యారు. పీఏసీఎస్ కేంద్రాల్లో జీలుగ విత్తనాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించడం జరిగిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఈవో మురళిని విధుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. తొర్రూరు, పెద్దవంగర పీఏసీఎస్ కేంద్రాల్లో జీలుగ విత్తనాల విక్రయాలపై విచారణ కొనసాగుతుందని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

## 'విద్యుత్ పోల్' పరీక్షకు ఏర్పాట్లు

- 22న ములుగురోడ్డు ఎన్‌పీటీఐ కేంద్రంలో నిర్వహణ

హనుమకొండ టౌన్, జూన్ 18 : జూనియర్ లైన్‌మెన్ నియామకంలో భాగంగా ఈ నెల 22న నిర్వహించే విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్షకు ఎన్పీడీసీఎల్ అన్ని ఏర్పాట్లను చేసింది. 2018 ఫిబ్రవరి 16న టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లకు 2553 జేఎల్‌ఎంలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా ఉమ్మడి జిల్లాలో 575 పోస్టుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగా, ఈ పోస్టుల కోసం రోస్టర్ పద్ధతిలో ఇప్పటికి వరకు 6 దశల్లో పోల్ పరీక్ష నిర్వహించగా, 22న ములుగు రోడ్డులోని నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌పీటీఐ) కేంద్రంలో నిర్వహించే 7వ దశ పరీక్షకు మంగళవారం ఫోర్‌మెన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కాగా, ఈ పరీక్షకు 16 మంది అభ్యర్థులు హాజరవుతుండగా పోల్ పరీక్షను ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఎస్ఈలు వెంకటరమణ, మధుసూదనరావుతో పాటు ఎన్‌పీటీఐ డీఈ, ఇతర అధికారుల పర్యవేక్షణలో నిర్వహించి పారదర్శకత కోసం వీడియోగ్రఫీ సైతం తీయడం జరుగుతుందని వెల్లడించారు. కాగా, అభ్యర్థులు దళారులను నమ్మవద్దని, తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో ఉదయం 9 గంటలకు ములుగురోడ్డులోని ఎన్‌పీటీఐ కేంద్రంలో హాజరుకావాలని హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ సూచించారు.



స్తంభాల చుట్టూ ఏర్పాట్లు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

## సివిల్ సర్వీస్ పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 18 : సివిల్ సర్వీస్-2025 సంవత్సరంలో పరీక్ష రాసే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 040-24071178 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## రుద్రేశ్వరుడికి ట్రైయినీ ఐఏఎస్‌ల పూజలు



రుద్రేశ్వరాలయంలో ట్రైయినీ ఐఏఎస్ అధికారులు

హనుమకొండ కల్చరల్, జూన్ 18 : నగరంలోని ప్రసిద్ధ వేయి స్తంభాల రుద్రేశ్వరాలయాన్ని మంగళవారం సాయంత్రం పలువురు ట్రైయినీ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. తొలిసారిగా నగరానికి విచ్చేసిన వారు చారిత్రక వేయిస్తంభాల ఆలయ శిల్ప సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టూరిజం అధికారి శివాజీ ఆధ్వర్యంలో మనోజ్, అజ్మిర సంకేత్ కుమార్, గరిమ నరుల అభిజ్ఞాన్ మాల్వియ, మహిళా అధికారిణి ఉమా హారతి, అజయ్ యాదవ్‌లు ఆలయాన్ని సందర్శించిన అధికారుల్లో ఉన్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన వేయిస్తంభాల కల్యాణ మండపాన్ని కూడా తిలకించారు. ఆలయ ప్రాంగణంలో అనేక ఫొటోలు దిగారు. ఆలయంలో ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ వారికి స్వాగతం పలికి రుద్రేశ్వరుడికి వారిచే మారేడుదళ బిల్వార్చణ నిర్వహింపజేసి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# డబుల్.. ట్రబుల్

- బీఆర్ఎస్ హయాంలో ఇళ్ల నిర్మాణం
- పాత వాటి విషయంలో గందరగోళం
- అద్దెకు కొన్ని.. అమ్ముకున్నవి కొన్ని ఉన్నాయనే ఆరోపణలు
- కొత్త వాటికి సంబంధించి పంపిణీ కాని పట్టాలు
- ఆందోళన బాట పడుతున్న లబ్ధిదారులు
- భూపాలపల్లిలో రోజురోజుకు జటిలమవుతున్న సమస్య



వేశాలపల్లి శివారులో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయాలు

భూపాలపల్లిటౌన్, జూన్ 18 : పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యమంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కానీ పేదల సొంతింటి కల నెరవేరడేమేమో గానీ సమస్య తార స్థాయికి చేరింది. ముఖ్యంగా ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భూపాలపల్లి జిల్లాలో రెండుదశల్లో 960 ఇళ్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించినా వాటిని సకాలంలో అర్హులకు అందించలేకపోయిందనే విమర్శలున్నాయి. మొదటి దశలో నిర్మించిన 544 ఇళ్లకు గాను లబ్ధిదారులందరికీ పట్టాలు ఇచ్చి ఇంటి నెంబర్లను కూడా కేటాయించారు. ప్రస్తుతం వాటిలో కేవలం 200 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. అందులో కొందరు విక్రయించినట్లు, మరికొందరు అద్దెకు ఇచ్చినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఇదిలావుండగా.. రెండవసారి 416 ఇండ్లను నిర్మించగా.. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా సుమారు 393 మందికి ఇంటి నెంబర్లు అలాట్‌చేశారు కానీ పట్టాలు ఇవ్వలేదు. లబ్ధిదారుల జాబితాను తయారు చేసినా అధికారికంగా ఎలాంటి ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొంది. దీంతో రెండో దశలో ఎంపికైన లబ్ధిదారులు వరుసగా ఆందోళనలు చేస్తుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది.

### ఆందోళనలకు కారణమిదే..

వేశాలపల్లి శివారు భాస్కర్‌గడ్డ సమీపంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 416 ఇళ్లను నిర్మించింది. అయితే వాటిని సకాలంలో కేటాయించకపోగా ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు. పైగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావిడిగా ఇంటి నెంబర్లు తూతూ మంత్రంగా కేటాయించారు. 393 మంది లబ్ధిదారును గుర్తించి వారికి అలాట్‌మెంట్ చేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. కానీ ఎటువంటి ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. ఈ క్రమంలో ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగడం , కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో లబ్ధిదారులకు ఆందోళన మొదలైంది. తమకు ఇండ్లు దక్కుతాయో లేదోననే బెంగతో ముందస్తుగా ఆందోళనకు పూనుకున్నారు. వీరికి మద్దతుగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కూడా మద్దతు పలికి ఆందోళనను ఉధృతం చేశారు. మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ అక్కడికి చేరుకుని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వారికి సరైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా వారు ఆందోళన విరమించలేదు.

### రెండు దశలు.. 960 ఇళ్లు...

భూపాలపల్లి పట్టణంలో నివసిస్తున్న పేద ప్రజలకు అర్హులైన వారికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు గాను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు దశల్లో 960 ఇళ్లను నిర్మించింది. అందులో మొదటి దశలో వేశాలపల్లి శివారులో సుమారు 5ఎకరాల భూమిలో 544 ఇండ్లను నిర్మాణం చేసింది. ఈ ఇండ్లు తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి ఉన్నప్పుడు నిర్మించారు. అనంతరం నాటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రెండోదశలో భాస్కర్‌గడ్డ శివారులో సుమారు నాలుగెకరాల్లో 416 ఇళ్లను నిర్మాణం చేశారు.

### 544 ఇళ్ల విషయంలో సమస్యలే..

వేశాలపల్లి శివారులో నిర్మించిన 544 ఇళ్ల విషయంలో సమస్య తీవ్రతరమైంది. అందరికీ పట్టాలు ఇచ్చినా అక్కడ కేవలం సుమారు 200 కుటుంబాలు మాత్రమే ఉంటున్నాయి. ఇందులో సుమారు 20 మంది సింగరేణి కార్మికులు ఉన్నారని, 20మంది అద్దెకు ఉంటున్నారని, మరికొన్నింటిని ఉద్యోగస్తులు కొనుగోలు చేశారని విమర్శలు వస్తున్నాయి. అలాగే ఈ ఇళ్లకు ఉన్న తలుపులు, కిటికీలు, విద్యుత్ సామగ్రిని, పైపులను, ఇతరత్ర సామగ్రిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకువెళ్లారు. కానీ ఇళ్లు కేటాయించడంతో లబ్ధిదారులే వాటిని సొంత ఖర్చులతో బాగుచేసుకున్నారు. మరికొంత మంది వదిలేశారు. ఒక్కో ఇంటికి సుమారు రూ.50వేల నుంచి రూ.1లక్ష వరకు అయ్యిందని చెబుతున్నారు. ఇంకా కొన్ని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేదు. తాగునీటి వసతి లేకపోవడంతో ఇటీవలే అధికారులు బోరు వేసి మోటారు బిగించారు కానీ.. 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని, దీంతో నీటి వసతి లేకుండా పోతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. పైగా అన్నింటికి ఒకే ఒక ప్రధాన రోడ్డు ఉందని, ఒకదానికి వేర్వేరుగా వేయాలని కోరుతున్నారు.

### కబ్జా బారిన రెండెకరాలు..

544 ఇళ్లు నిర్మించిన ప్రాంతంలో సుమారు ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. కానీ అందులో రెండు ఎకరాల భూమిని ఆట స్థలానికి, పార్కు కోసం కేటాయించారు. కానీ ఆ రెండు ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు తమ అధికారాలను అడ్డంపెట్టుకుని కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు.

### గత ప్రభుత్వం గందరగోళాన్ని సృష్టించింది

**గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే**



గత ప్రభుత్వం పేద ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించింది. సక్రమంగా డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించలేదు. అర్హులకంటే.. అనర్హులు ఎక్కువగా ఉన్నారనే సమాచారం ఉంది. కొన్నింటికి ఇంకా పట్టాలు కూడా ఇవ్వలేదు. అయితే వాటన్నింటిని పరిశీలించి అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు అందించి న్యాయం చేస్తాం. మరో 15 రోజుల్లో ప్రక్రియ ప్రారంభిస్తాం.



## ఉద్యోగాలు ఇప్పిస్తామని ముఠా మోసం?

మట్టెవాడ, జూన్ 18: ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, డబ్బులు వసూలు చేసి, అటు ఉద్యోగం ఇప్పించక, ఇటు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు మంగళవారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. బాధితుల కథనం ప్రకారం వరంగల్ మామునూరుకు చెందిన వ్యక్తితోపాటు హనుమకొండలో నివాసం ఉంటున్న మరో నలుగురు ఒక ముఠాగా ఏర్పడి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించారు. ఒక్కొక్కరి వద్ద నుంచి మూడు నుంచి నాలుగు లక్షల రూపాయలు వసూలు చేశారు. నెలలు గడిచినా ఉద్యోగాలు ఇప్పించకపోవడం, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్టు బాధితులు భావించారు. వరంగల్ జిల్లాతోపాటు నిర్మల్ జిల్లా బైంసా, హనుమకొండ ఇతర జిల్లాల నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో ఈ ముఠా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని సమాచారం. మంగళవారం బాధితులు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

## ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 18 : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూపు-2 పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులకు బీసీ స్టసడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 040-24071178 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మిషన్ భగీరథ గేట్‌వాల్వ్‌కు మరమ్మతులు

**'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు**



చీటూరులో మరమ్మతులు చేపడుతున్న అధికారులు

లింగాలఘణపురం, జూన్ 18: మండలంలోని చీటూరులో లీక్ అవుతున్న మిషన్‌భగీరథ గేట్‌వాల్వ్‌కు అధికారులు మంగళవారం మరమ్మతులు చేశారు. గేట్‌వాల్వ్ లీకై మూడు రోజులుగా నీరు వృథాగా పోతుండడంతో పాటు చెరువు కట్టకు గండి పడుతున్న విషయమై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై 'మిషన్ భగీరథ గేట్‌వాల్వు లీకేజీ' శీర్షికన ఈనెల 18న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మిషన్‌భగీరథ (గ్రిడ్)డీఈఈ శ్రీనివాస్, ఏఈ ప్రజ్వల్ మంగళవారం చీటూరుకు చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ ప్రజ్వల్ మాట్లాడుతూ పాలకుర్తి నియోజకర్గానికి సరఫరా కావాల్సిన తాగునీటి కోసం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం వల్ల ఆలస్యం జరిగిందని ఇందులో శాఖాపరమైన నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జనగామ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రఘునాథపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జనగామ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథపల్లి, నిడిగొండ, గబ్బెట, కంచనపల్లి, కుందారం, వడ్డిచర్ల, లింగాలఘనపురం, కోమల్ల, ఖిలాషాపూర్, అశ్వరావుపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

## గిరి ప్రదక్షిణకు తరలిన భక్తులు

జనగామ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో చేపట్టిన గిరి ప్రదక్షిణకు జనగామ నుంచి భక్తులు మంగళవారం తరలివెళ్లారు. కొంత కాలంగా మరుగున పడిపోయిన గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఈవో భాస్కర్‌రావు చొరవతో తిరిగి ప్రారంభించారు. లక్ష్మీనర్సింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలయ ఈవో భాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జనగామ నుంచి ఉదయం 4 గంటలకు బైక్‌లపై భక్తులు తరలివెళ్లారు. వారిలో ధర్మపురి శ్రీనివాస్, జక్కుల వేణుమాధవ్, చింతకింది మల్లేశ్, చుంచు శ్రీకాంత్, అనంతుల అంజనేయులు, తుంగ కౌశిక్, మహేశ్, రాజు తదితరులు ఉన్నారు.

## రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూన్ 18: శివునిపల్లి పట్టణంలో ఈ నెల 20న ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎమ్డీ దస్తగిరి తెలిపారు. హన్మకొండ శరత్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జయ గార్డెన్ రోడ్డులోని దస్తగిరి ఇంటి వద్ద నేత్ర పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. హెల్త్ కార్డు కలిగి ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి అవసరమైతే శరత్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేస్తారని చెప్పారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి రవాణా, వసతి, భోజనం వసతి ఉంటుందని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని దస్తగిరి కోరారు.

# నిర్మాణానికి నిధులేవీ?

- అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం కరువు
- భూమి కేటాయించి చేతులు దులుపుకొన్న సర్కారు
- ఎమ్మెల్యే స్పందించాలని మండల ప్రజల విజ్ఞప్తి

పాలకుర్తి, జూన్ 18 : నియోజకవర్గానికి ఏకైక దిక్కుగా ఉన్న అగ్నిమాపక కేంద్రానికి ఇంత వరకు సొంత భవనం లేదు. ఆరేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి అర ఎకరం స్థలాన్ని కేటాయించింది. కాని ఇప్పటి వరకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. దీంతో తాత్కాలికంగా శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయ సత్రంలో ప్రస్తుతం కార్యాయాలయం ఏర్పాటు చేశారు. కానీ సొంత భవనం నిర్మిద్దామనే ఆలోచన అటు పాలకులు, ఇటు అధికారులు రావడం లేదు.

**2017 - 18 లో అగ్నిమాపక కేంద్రం మంజూరు..**

అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని 2018 మార్చి నెలలో అగ్ని మాపక కేంద్రాన్ని మంజూరు చేయించారు. ప్రస్తుతం శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో దాతల సహకారంతో నిర్మించిన భవనంలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ సరైన సదుపాయాలు కరువయ్యాయి. ఫైర్ ఇంజన్‌లో నీరు నింపాలంటే మాజీ సర్పంచు యాకాంతరావు ఇంటి సమీపంలో ఉన్న బోరుపై ఆధారపడాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో అక్కడ నీరు దొరకకపోతే చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులను ఆశ్రయించాల్సి వస్తోంది. అంతేగాకుండా ప్రస్తుత కార్యాలయంలో వాహనం నిలిపేందుకు స్థలం లేకపోవడంతో ఆలయం పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ వాహనం పాక్షికంగా దెబ్బతింటోంది. దాంతో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.



పాలకుర్తిలో అగ్నిమాపక కేంద్రానికి కేటాయించిన స్థలం



దేవస్థానం భవనంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక కేంద్రం

**నలుగురే సిబ్బంది..**

పాలకుర్తి అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది కొరత ఉంది. మొత్తం 16 మందికి గాను ప్రస్తుతం కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. ఒక ఫైర్ అధికారితో ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ఫైర్‌మెన్‌లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఒక వేళ భారీ ప్రమాదం జరిగితే ఇతర కేంద్రాల నుంచి తీసుకు రావాల్సిందేనని సిబ్బంది చెబుతున్నారు.



**సొంత భవనం లేక ఇబ్బంది పడుతున్నాం..**

**శ్రీరాములు, ఫైర్ అధికారి, పాలకుర్తి**

ఆరేళ్ల నుంచి సొంత భవనం లేక అరకొర వసతులతో అందరం ఇబ్బంది పడుతున్నాం. దేవస్థానం వద్ద ఎక్కవగా స్థలం లేకపోవడంతో వాహనాన్ని ఆరుబయట ఎండలో పెడుతున్నాం. దీంతో వాహనం దెబ్బతింతోంది. సిబ్బంది కొరత కూడా ఉంది.

## చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

**పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజ్**



సమావేశంలో మాట్లాడుతున్న వేముల బాలరాజ్

చిలుపూర్, జూన్ 18: రాష్ట్రంలో అప్పులు, ఆకలి బాధలతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజ్ నేత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నపెండ్యాలలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బలమైన శక్తిగా పద్మశాలీలు ఎదిగారని, కాంగ్రెస్ పార్టీ ద్వారానే చేనేత కార్మికులు, పద్మశాలీలకు మేలు చేకూరుతుందన్న లక్ష్యంతో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేశారని అన్నారు. త్వరలోనే రాష్ట్ర, జిల్లా, మండల కమిటీలను ఏర్పాటు చేయనున్నామని, రానున్న స్థానిక ఎన్నికల్లో పద్మశాలీల సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు, చిలుపూర్ ఆలయ మాజీ డైరెక్టర్ గజ్జెల దామోదర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్యామల పరమేశ్వర్ నేత, చింతకింది కృష్ణమూర్తి నేత, భిక్షపతి, పేరాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### తాటిచెట్టుపై నుంచి పడి
## గీత కార్మికుడి మృతి



వెంకటరాజు (ఫైల్)

చిలుపూర్, జూన్ 18: తాటిచెట్టుపై నుంచి జారి పడి సట్ల వెంకటరాజు (50) అనే గీత కార్మికుడు మృతిచెందాడు. రోజు మాదిరిగానే ఆయన కల్లు గీసేందుకు చెట్టు ఎక్కుతుండగా మోకు జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటరాజును కుటుంబ సభ్యులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్సై ముత్యం రాజేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు ఆత్మహత్య



జక్కుల రాజు (ఫైల్)

బచ్చన్నపేట, జూన్ 18: మండలంలోని కేశిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జక్కుల రాజు(42) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరు నెలల క్రితం ఆయన కూతురు వివాహం చేశారు. ఈ క్రమంలో ఏం జరిగిందో తెలియదు కాని భార్య స్వప్న వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడు. ఆయనకు భార్య స్వప్న, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఆసుపత్రికి తరలించారు. కాగా, రాజు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చిలుపూర్, జూన్ 18: చిన్నపెండ్యాల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. కొండాపూర్‌కు చెందిన శ్రీపతి వెంకటేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో స్టేషన్‌ఘన్‌పూర్ వైపు వెళ్తుండగా చిన్నపెండ్యాల గేమ్యతండా క్రాస్‌రోడ్డు వద్ద ట్రాలీ వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో కారు వెనుక భాగం నుజ్జునుజ్జు కాగా, అందులో ఉన్న మహిళలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై రాజేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లాను అభివృద్ధి పథంలో నిలపాలి

**కలెక్టర్ రిజ్వాన్ బాషా**

నర్మెట, జూన్ 18: జనగామ జిల్లాను అభివృద్ధి పథంలో నిలపాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఆర్థిక ప్రగతికి కృషి చేసిన మహిళా సంఘాలను అభినందించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి మొగులప్ప ఆర్థిక ప్రగతి సాధించిన మహిళ సంఘాలు, సెర్ప్ అధికారులు, బ్యాంకు అధికారులతో కలెక్టర్‌ను కలిసి నర్మెట మహిళ సంఘాలు సాధించిన ప్రగతిని వివరించారు. నర్మెట మండలంలో మహిళ సంఘాలు బ్యాంకు లింకేజి కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 16 కోట్ల లక్ష్యం కాగా 30 కోట్ల ప్రగతిని సాధించారని, ఈనెల 15న హైద్రాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో మంత్రి సీతక్క నర్మెట మహిళ సంఘాల ప్రతినిధులను, ఏపీఎంను, బ్యాంకు అధికారులను సన్మానించారని కలెక్టర్‌కు వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాలలో ప్రథమంగా నిలిపేందుకు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంలు, ఏపీఎంలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ పట్టాలను రద్దు చేయాలి

**అధికారులను వేడుకున్న శ్రీపతిపల్లి బాధితులు**



శ్రీపతిపల్లిలో మాట్లాడుతున్న బాధిత రైతు కుటుంబాలు

చిలుపూర్, జూన్ 18: అక్రమ పట్టాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన చేర్యాల పోశయ్య, నీల చిన్న వెంకటయ్య, నీల పెద్ద వెంకటయ్య అనే రైతులు అధికారులను వేడుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 1990 -91లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 63, 69లో ఒక్కొక్కరికి 1 ఎకరం చొప్పున పట్టాలివ్వడంతో కొన్నేళ్లపాటు సాగు చేశారు. అనంతరం రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొనడంతో జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన కొంతమంది వ్యక్తులు ఫోర్జరీ సంతకాలతో పట్టామార్పిడి చేసుకొని భూమిని కబ్జా చేశారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు, రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించలేదు. దీంతో చివరకు తమ భూములు తమకు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌తో పాటు, ఇతర ఉన్నతాధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు.

# కస్తూర్బా ఎస్‌వోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జఫర్‌గఢ్, జూన్ 18: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయ ఎస్‌వో స్వప్న.. పాఠశాలకు చెందిన అమ్మ ఆదర్శ విద్యా కమిటీ సభ్యులకు తెలపకుండా, ఫోర్జరీ సంతకాలతో తీర్మానాలు చేసి పాఠశాలలో అభివృద్ధి పనులను చేపడుతున్నారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్, విద్యాలయ ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బానోత్ దుర్గాసింగ్ మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు ఫిర్యాదు చేశారు. పాఠశాల అభివృద్ధికి రూ.6 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీలతో పనులు చేయించాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా పాఠశాలకు సంబంధం లేని వారితో పనులు చేయిస్తోందన్నారు. ఈ విషయమై విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరారు.

**రోడ్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి...**

జఫర్‌గఢ్ సెంటర్‌లో, గ్రామ చివర రైతు భవనం వద్ద ఈజీఎస్ సీసీ రోడ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎండి.నజీర్ కలెక్టర్ రిజ్వాన్ బాషాను కోరారు. మండల కేంద్రంలో ఆయన కలెక్టర్‌ను కలిసి.. ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతూ రోడ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నాడని, విచారణ జరిపి నిర్మాణాలను పూర్తి చేయాలని కోరగా, కలెక్టర్ స్పందించి ఈ విషయమై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీడీవోను ఆదేశించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

## సైట్లు సిద్ధం.. సర్కారుదే ఆలస్యం

(5వ పేజీ తరువాయి)

పడిన పార్కు విషయంలో కదలిక వచ్చింది. అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 25 కోట్లతో 117 ఎకరాల స్థలంలో అభివృద్ధి పనులు జరిగాయి. 117 ఎకరాల ప్రతిపాదిత పార్కు స్థలంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. టెక్స్‌టైల్ పార్కుకు అవసరమయ్యే విద్యుత్ కోసం పార్కులోనే 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పనులు దాదాపుగా పూర్తి కాగా ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే బిగించాల్సి ఉంది. దీంతో పాటు నీటి సౌకర్యం కోసం భారీ ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చివరి దశలో ఉంది. ప్రతిపాదిత 117 ఎకరాలను ప్లాట్లుగా లేఅవుట్ చేసి 465 యూనిట్లను ఏర్పాటు చేసేలా సిద్ధం చేశారు. 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఒక్కో ప్లాటును లేఅవుట్ చేశారు. 465 యూనిట్లకు గాను సూరత్, సోలాపూర్‌కు చెందిన 39 మంది ఔత్సాహికులు పవర్‌లూమ్ ఆధారిత క్లాత్ తయారీ పరిశ్రమల ఏర్పాటు కోసం ముందుకొచ్చారు. ఔత్సాహికులు చదరపు మీటరకు రూ.3136 చొప్పున 500 చదరపు యూనిట్లకు డబ్బులు చెల్లించగా వారి పేరు మీద సేల్ అగ్రిమెంట్‌ను టీఎస్ఐఐసీ ఇచ్చింది. మొత్తం 88 మంది ముందుకు రాగా వారిలో కొంత మంది డబ్బులు కట్టడంలో ఆలస్యం చేయడంతో వారి అలాట్‌మెంట్ రద్దు అయింది. ప్రస్తుతానికి 39 మంది సేల్ అగ్రిమెంట్ పూర్తికావడంతో వారు బ్యాంకు రుణం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల వారు కావడంతో బ్యాంకు రుణం విషయంలో కాస్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం సహకరిస్తే మరింత మంది ఔత్సాహికులు ముందుకు వచ్చే అవకాశం ఉంది. సూరత్, సోలాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్తలే కాకుండా స్థానికంగా ఉన్న చేనేత కార్మికులు సైతం పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

**అందుబాటులోకి వస్తే 20 వేల మందికి ఉపాధి..**

టెక్స్‌టైల్ పార్కు అందుబాటులోకి వస్తే జనగామ జిల్లాతో పాటు పక్కనే ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సుమారు 20 వేల మంది ఉపాధి దొరుకుతుంది. 15 వేల మంది ప్రత్యక్షంగా 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి అందనుంది. జిల్లాకేంద్రానికి కేవలం 8 కిలోమీటర్లు, వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి కేవలం 4 కిలోమీటర్ల దూరంలో మాత్రమే టెక్స్‌టైల్ పార్కు ఉంది. ఇటు రోడ్డుతో పాటు, రైల్వే రవాణా సౌకర్యం ఉన్నాయి. వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న పెంబర్తి గ్రామం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో టెక్స్‌టైల్ పార్కు ఉంది. పార్కుకు వెళ్లేందుకు మాణిక్యపురం గ్రామం ఇవతలి నుంచి బైపాస్ నిర్మాణం చేయాలని అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి ప్రక్రియ భూసేకరణ దశలో ఉంది. ఈ భూసేకరణ పూర్తయి పెంబర్తి నుంచి రెండు వరసల రోడ్డు నిర్మాణం జరిగితే టెక్స్‌టైల్ పార్కు జనగామ జిల్లాకు తలమానికంగా ఉంటుంది.

### కాజీపేట రైల్వేస్టేషన్‌లో
## రూ.5లక్షల విలువైన గంజాయి స్వాధీనం

కాజీపేట, జూన్ 18 : కాజీపేట రైల్వేస్టేషన్ ఆటోస్టాండ్ వద్ద పోలీసులు 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆటో స్టాండ్‌లో ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకుని బ్యాగులు తనిఖీ చేయగా అందులో 22 కిలోల గంజాయి లభించింది. విచారణలో తను ఒడిషా రాష్ట్రం గణపతి జిల్లా కేంద్రానికి చెందిన అఖిల నాయక్ బిపిన్ కుమార్ అని కొంత కాలంగా వివిధ రాష్ట్రాలలో గంజాయి సప్లై చేస్తున్నానని, ఈ నెల 16న ముంబైలో ఓ వ్యక్తి వద్ద 22 కిలోల గంజాయి కొని ప్యాకెట్లలో సీల్‌చేసి కాజీపేట రైల్వే స్టేషన్‌లో అమ్మడానికి తెచ్చానని చెప్పాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. గంజాయి విలువ రూ.5.50 లక్షలు ఉంటుందని ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

## ఘనంగా అష్టదళ పాదపద్మారాధన పూజ



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చిలుపూర్, జూన్ 18 : చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న దేవాలయంలో మంగళవారం అష్టదళ పాదపద్మారాధన పూజను ఘనంగా నిర్వహించారు. ప్రతీ మంగళవారం నిర్వహించే సువర్ణ పుష్పార్చనను పురస్కరించుకుని రూ.40 లక్షల విలువ గల 108 స్వర్ణాలతో స్వామివారి పాదాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలలతో పాటు, రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారులు సౌమిత్రి రంగాచార్యులు కృష్ణమాచార్యులు వేదమంత్రాలనాలపించడంతో పాటు, పూజా విశిష్టతను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, ఆలయ అభివృద్ధి శాశ్వత దాతలు పొట్లపల్లి శ్రీధర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్ - చిలుపూర్ మండలాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజుగౌడ్, సంగోజు మోహనాచారి, మాజీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమయం పాటించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 18: ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని నోడల్ అధికారి జి. కొమురయ్య అన్నారు. మంగళవారం ఘన్‌పూర్ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, విశ్వనాథపురం బీసీ కాలనీ, తానేదార్‌పల్లి, మాన్‌సింగ్ తండా, చంద్రుతండా, కేజీబీవీ పాఠశాలలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ పాఠశాల హెచ్‌ఎం సంపత్, ఉపాధ్యాయులు జయమ్మ, కొమురెల్లి, అశోక్, వెంకటచారి, రమేష్, శ్రీదేవి పాల్గొన్నారు.

## గెజిటెడ్ హెచ్‌ఎంలకు సన్మానం



హెచ్‌ఎంలను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 18: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల పదోన్నతులలో భాగంగా గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొంది విధుల్లో చేరిన శివునిపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం.కుసుమ రమేష్‌ను, ఘన్‌పూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం. సంపత్‌ను మంగళవారం డివిజన్ కేంద్రంలో పీఆర్టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు గిరెడ్డి ప్రమోద్ రెడ్డి, ప్రధానకార్యదర్శి ప్రవీణ్, మండల నోడల్ అధికారి కొమురయ్య, రాష్ట్ర బాధ్యులు ప్రవీణ్, రవికుమార్, సత్యప్రకాశ్, గిరి, శ్రీధర్, సదామోహన్, తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

బచ్చన్నపేట, జూన్ 18: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన కట్కూరి సిద్దులు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల కోసం గ్రామానికి చెందిన సామాజిక సేవకులు కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, భాస్కర్, కనుకయ్య, వెంకటయ్య, వీర నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలంటూ వినతి

నర్మెట, జూన్ 18: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ పక్కన ఉన్న బీసీ కాలనీలో వికలాంగుల కమిటీ హాల్ కోసం ఇచ్చిన స్థలాన్ని కబ్జాదారులనుంచి కాపాడాలని కోరుతూ వికలాంగులు మంగళవారం ఎంపీడీవో అరవింద్‌కు, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్మెటలో గతంలో టీడీపీ ప్రభుత్వ హయంలో సర్వే నెం.785లో తొమ్మిది ఎకరాల ఇరవై గుంటల భూమి కొనుగోలు చేసి బీసీలకు ఇండ్ల నిర్మాణం కోసం ఒక్కోక్కరికీ 170 గజాలు ఇచ్చిందని, అందులో ఎవరూ ఇండ్లు నిర్మించుకోకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అందులో ఐదు ఎకరాల భూమిని మోడల్ స్కూల్ నిర్మాణం కోసం ఇచ్చిందని అన్నారు. మిగతా భూమిని 80 గజాల చొప్పున కుదించి కుదించి బీసీలకు ప్లాట్లు ఇచ్చారని, దాంట్లో దన్నారపు శోభ మురళిలకు 80 గజాలు ఇచ్చారని అన్నారు. వారి పక్కనే ఉన్న ప్లాటును వికలాంగులకు కమిటీ హాల్ కోసం గత సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, కార్యదర్శి ఇచ్చారని అన్నారు. ఆ స్థలాన్ని దన్నారపు శోభ మురళి కబ్జా చేసి రేకుల షెడ్డు వేశారని, దాన్ని తొలగించి స్థలం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో తీగల రామరావు, మొడెం రాజు, కనకయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో అరవింద్‌కు వినతిపత్రం ఇస్తున్న వికలాంగులు